సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 3 । జూన్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 40.258 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 94.232 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.62,200
22 క్యారెట్లు ఆర్నమెంట్(గ్రా)	- రూ.5,586
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,752
నవర (8 గ్రా) -	రూ.46,000

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /30.9

శుక్రవారం గాలిలో తేమ 41 శాతం ఉంది. శనివారం అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

గ్రాఫిక్స్ కాదు.. అభివృద్ధి

- ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం
- ఆ దిశగా పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- సుందరంగా మారుతున్న నెల్లూరు నగరం

గత నాలుగేళ్లలో..

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వెచ్చించిన నిధులు - రూ.189 కోట్లు

తాగునీటి పనులకు ఖర్చు చేసింది - రూ.17 కోట్లకు పైగా..

ఇతర పనుల కోసం వెచ్చించింది - రూ.120.79 కోట్లు

నాలుగేళ్లలో రూ.327 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు



అభివృద్ధి అంటే గ్రాఫిక్స్ కాదని.. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చూపడంతో పాటు ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమేనని రాష్ట్ర ప్రభుత్వం నిరూపిస్తోంది. పల్లెల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తుండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టింది. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా దృష్టి సారించింది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉండగా ఇందులో దాదాపు 8 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఎక్కడైతే రోడ్లు, డ్రెయిన్లు లేవో అక్కడ కొత్తగా సీసీరోడ్లు, మురుగునీటి కాలువలను నిర్మించారు. ఇలా గడిచిన నాలుగేళ్లలో నగరంలో మొత్తం రూ.327 కోట్లతో పలు అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ అధికారులు చేపట్టి పూర్తి చేశారు.

ఏఏ పనులకు ఎంతెంత..

గత నాలుగేళ్ల (2019 నుంచి 2023 వరకు)లో 403 పనులు చేపట్టి రూ.96.35 కోట్లతో వీధుల్లో సీసీరోడ్లు నిర్మించారు. ఇందులో 42 పనులు మినహా మిగిలిన రోడ్ల పనులను పూర్తి చేశారు. అలాగే 359 పనులతో మురుగు కాలువల (డ్రెయిన్ల) నిర్మాణానికి రూ.93.34 కోట్లు వెచ్చించారు. ఇందులో 36 పనులు జరగాల్సి ఉంది. అదే విధంగా తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.17.18 కోట్లు ఖర్చు చేసి 7 పనులు మినహా మిగిలిన 164 పనులు పూర్తి చేశారు. ఇతర చిన్న చిన్న సమస్యలకు సంబంధించి 1,817 పనులకు గాను 1,585 పనులను పూర్తి చేశారు. ఇందుకు రూ.120.79 కోట్లు ఖర్చు చేశారు.

సీసీ రోడ్లు.. డ్రెయిన్లు

గత నాలుగేళ్లలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మించారు. ఎక్కడైనా రోడ్డు పాడైనా, గుంతలు పడినా వెంటనే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనదారులు, పాదచారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. నగరంలోని దాదాపు 80 శాతం మేర వీధుల్లో మురుగునీరు పారుదల కోసం కాలువలు (డ్రెయిన్లు) నిర్మించారు. దీంతో మురుగు నీరు నిల్వ లేకుండా సాఫీగా సాగుతోంది.

నిరంతరాయంగా తాగునీటి సరఫరా

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటికి ఇబ్బందులు వస్తుంటాయి. అలాంటిది తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పైపులైన్లను నిత్యం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే వాటికి రిపేర్లు చేస్తున్నారు.



వేదాయపాళెంలో డివైడర్‌కు ఇరువైపులా అద్దంలాంటి రోడ్లు, నాటేందుకు సిద్ధం చేస్తున్న మొక్కలు

మౌలిక వసతుల కల్పనకే ప్రాధాన్యం



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో రాజీ పడేది లేదు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, కాలువలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటి నిర్మాణం, మరమ్మతులు వెంటనే చేపడతాం. నగరంలో మౌలిక వసతుల కల్పనకు నావంతు కృషి చేస్తా.

– వికాస్ మర్మత్, కమిషనర్, నగరపాలక సంస్థ

పనులు త్వరగా పూర్తి చేస్తాం



నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, కాలువలు, తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్ల పనులు చాలా వరకు పూర్తి చేశాం. ఇంకా కొన్ని ప్రారంభించాల్సినవి ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని పనులు జరుగుతున్నాయి. వీటిని కూడా వీలైనంత త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, నగరపాలక సంస్థ

మా ప్రాంతం మొత్తం రోడ్లు వేశారు



మేము బంగ్లాతోట ప్రాంతంలో నివసిస్తున్నాం. గతంలో మా ప్రాంతంలో వేసిన సిమెంట్ రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగేళ్లలో మా ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్లుకు మరమ్మతులు చేశారు. అలాగే కొన్ని వీధుల్లో కొత్త రోడ్లు వేశారు. దీంతో ప్రస్తుతం రోడ్లన్నీ బాగున్నాయి.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట, నెల్లూరు నగరం

ఇలా అన్నివిధాలుగా నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ల సహకారంతో అధికారులు పనులు చేపడుతున్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

92.25 శాతం మందికి పింఛన్లు


కోవూరు మండలం పడుగుపాడులో వృద్ధుడు చెన్నరాయుడుకు పింఛన్ నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి.

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. శుక్రవారం రెండో రోజు నాటికి 92.25 శాతం మంది లబ్ధిదారులకు కానుక నగదు అందజేశారు. 3,05,723 మందికి నగదు అందజేయవలసి ఉండగా 2,82,035 మందికి పంపిణీ చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో రాపూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ప్రశాంతంగా పోలీసుల బదిలీల ప్రక్రియ


బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఐదేళ్లు పూర్తిచేసుకున్న కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు బదిలీల ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. 19 మంది ఏఎస్ఐలు, 47 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 947 మంది కానిస్టేబుళ్లు మొత్తంగా 160 మందిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ మాట్లాడుతూ పారదర్శకంగా బదిలీల ప్రక్రియ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, ఏవో విజయకుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్


సోమశిల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చేజర్ల (సోమశిల): జిల్లా కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం సోమశిల ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్ట్ ప్రాంతంలో ఇంజనీర్లతో మాట్లాడారు. జలాశయంలోని నీటి నిల్వలను, డెల్టా, నాన్ డెల్టాలకు విడుదలయ్యే నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి పారుదలలో ఏమైనా అడ్డంకులుంటే సిబ్బందితో సరి చేయించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ప్రాజెక్ట్ ఈఈ దశరథరామిరెడ్డి ఉన్నారు. యాప్రాన్ పనులు 20 శాతం మేర పూర్తయాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ, జేఈఈలు, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిళ్లే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసింహం

ఉదయగిరి: ప్రతి పేదవానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలందరికీ ఇళ్లు పథకం ప్రవేశపెట్టిందని, దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ నరసింహం పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా 86,241 పక్కాగృహాలు మంజూరు కాగా వివిధ కారణాలతో 13,124 ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ఆ లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'యంత్రసేవ'.. రైతుకు చేవ



గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు 'రైతు రథం' పథకాన్ని దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడగా, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని పక్కాగా, పారదర్శకంగా అమలు చేస్తూ రైతుల మన్ననలు పొందుతోంది. అన్నదాతలకు వందలాది ట్రాక్టర్లు, ఇతర యాంత్రీకరణ పరికరాలు అందజేస్తూ అండగా నిలుస్తోంది.

- నేడు రైతులకు 147 ట్రాక్టర్ల పంపిణీ
- పారదర్శకంగా అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రైతుల సాగు అవసరాలు తీర్చి, యాంత్రీకరణ ద్వారా సాగు వ్యయం తగ్గించి నికర ఆదాయం పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ యంత్రసేవా పథకం జిల్లాలో పారదర్శకంగా అమలవుతోంది. 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు అర్హత ఉన్న రైతు గ్రూపులకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'రైతురథం' పథకం నేతలకు ఫలహారంగా మారిన సంగతి తెలిసిందే. ట్రాక్టర్ల పంపిణీలో అప్పటి మంత్రుల నుంచి ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీ సభ్యుల వరకు కమీషన్లు దండుకుని రైతులను దగా చేసిన విషయం విదితమే.

అన్నదాతలకు వెన్నుదన్ను

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,20,785 ఎకరాల విస్తీర్ణంలో, రబీ సీజన్‌లో 4,95,403 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి, మినుము, వేరుశనగ, పత్తి, పెసర, నువ్వులతోపాటు ఇతరత్రా పంటలు సాగవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మేలు చేసేలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. అందులో వైఎస్సార్ రైతుభరోసా, పంటల బీమా, ధాన్యం కొనుగోళ్లు, సున్నావడ్డీ రుణాలు, యంత్రసేవా పథకం, విత్తన సబ్సిడీ ఇలాంటి ఎన్నో పథకాలు అమలు చేయడమేకాకుండా గ్రామస్థాయిలోనే రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతోపాటు రైతులకు అవసరమైన అన్ని సలహాలను అందిస్తోంది. వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని ప్రవేశపెట్టి యాంత్రీకరణ పరికరాలు, ట్రాక్టర్లు అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 'యంత్రసేవా పథకం' అమలులో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా రైతులు కోరుకున్న కంపెనీకి చెందిన ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నారు. 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం ఇస్తుండడంతో రైతు కేవలం 10 శాతం మాత్రమే చెల్లించి యంత్ర పరికరాలను పొందుతున్నారు. పంపిణీలో ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నారు.

మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా నేడు పంపిణీ

జిల్లాలో 'వైఎస్సార్ యంత్రసేవా పథకం' ద్వారా గత ఏడాది 233 ట్రాక్టర్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ ఏడాది 206 రైతుభరోసా కేంద్రాల్లో సీహెచ్‌సీ గ్రూపులు ఏర్పాటు చేశారు. ఇందులో 126 గ్రూపులు ఇప్పటి వరకు వ్యవసాయ యంత్రాలను సిద్ధం చేసుకున్నాయి. దీని మొత్తం రూ.10.98 కోట్లు కాగా అందులో రూ.3.51 కోట్ల సబ్సిడీ రైతు ఖాతాల్లో జమ కానుంది. శనివారం జిల్లాలో 147 ట్రాక్టర్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ రైతులకు పంపిణీ చేయనున్నారు.

ముందుగానే బుకింగ్

- గ్రామస్థాయిలోనే రైతు గ్రూపులను ఏర్పాటు చేసి యంత్రసేవా కేంద్రాలను నిర్వహిస్తోంది.
- ఆర్బీకేల్లోనే యంత్ర పరికరాలు ఉంచి సులభతరంగా యంత్రాలను బాడుగకు బుక్ చేసుకొనేలా వైఎస్సార్ యంత్రసేవా యాప్‌ను విడుదల చేసింది. ఈ యాప్ ద్వారా రైతులు వారికి కావాల్సిన వ్యవసాయ పరికరాలను 15 రోజుల ముందుగానే బుక్ చేసుకునే సౌలభ్యం కల్పించింది.

యువకుడిని రక్షించిన మెరైన్ పోలీసులు

- రామాయపట్నం సముద్ర తీరంలో ఘటన

ఉలవపాడు: మండల పరిధిలోని రామాయపట్నం వద్ద సముద్రస్నానం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు అలల్లో కొట్టుకుపోతున్న యువకుడిని మెరైన్ పోలీసులు గమనించి కాపాడారు. ఈ ఘటన రామాయపట్నం లైట్ హౌస్ తీరంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. నెల్లూరులోని కోటమిట్టకు చెందిన పఠాన్ ఫాహిల్ తన బంధువులతో కలిసి సముద్రంలో స్నానం చేసేందుకు రామాయపట్నం వచ్చారు. మునుగుతున్న సమయంలో సముద్రంలో అల వచ్చి లోపలికి లాక్కెళ్లిపోతుండడంతో ఫాహిల్ కేకలు వేయగా హోమ్‌గార్డు మాణిక్యరావు గమనించి సముద్రంలోకి ఈదుకుంటూ వెళ్లి అతడిని బయటకు తీసుకొచ్చారు. మెరైన్ సీఐ కిశోర్‌కుమార్ వెంటనే ఆ యువకుడిని స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. తెట్టు గంధ మహోత్సవం ఉండడంతో ఎక్కువ మంది సముద్ర స్నానం చేసే అవకాశం ఉంది. దీంతో సీఐ ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


యువకుడిని కాపాడి తీరానికి తీసుకువచ్చిన మెరైన్ సిబ్బంది

నేటి నుంచి గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు

నెల్లూరు(దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ శుక్రవారం తెలిపారు. నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో ఆధారిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. ఉదయం 8 నుంచి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్షకు అనుమతిస్తారని, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే కలెక్టరేట్ కంట్రోల్ రూం నం: 0861 2331261లో సంప్రదించాలని తెలిపారు.

నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారం


పడమటినాయుడుపల్లిలో నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఆత్మకూరు రూరల్(మర్రిపాడు): హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు, ఆస్తులు కోల్పోతున్న పడమటి నాయుడుపల్లి, కంపసముద్రం గ్రామాల రైతులు, నిర్వాసితులకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి న్యాయబద్ధమైన పరిహారం, పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మర్రిపాడు మండలం పడమటి నాయుడుపల్లి, కంపసముద్రం గ్రామాల్లో శుక్రవారం జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారిలతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం అందించడంతోపాటు పునరావాసానికి సంబంధించిన కొన్ని సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకుండా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తరువాత తుది నిర్ణయం తీసుకొని డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో పొందుపరుస్తామన్నారు. అలాగే మార్కెట్ ధరల ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలోనూ పెరగని నిమ్మ ధరలు

- నిరాశ చెందుతున్న రైతులు

పొదలకూరు: నిమ్మకాయలకు గతేడాది వేసవిలో లూజు(బస్తా) రూ.14 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది రూ.6 వేల నుంచి రూ.7 వేలు మాత్రమే ధర పలకడంతో రైతులు డీలాపడ్డారు. ఇప్పుడున్న ధరలు తమకు సంతృప్తికరంగా లేవని రైతులు అంటున్నారు. ఢిల్లీ మార్కెట్లో ధరలను నిర్ణయిస్తుంటారు. అక్కడ డిమాండ్‌ను బట్టి ఇక్కడి నుంచి కాయలను ఎగుమతి చేస్తుంటారు. పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల నిమ్మతోటల్లో కాయలు బాగానే ఉన్నాయి. భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీరు పుష్కలంగా ఉండడం వల్ల కాయల దిగుబడి పెరిగింది. అయితే కాయలను రైతులు మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో నెల రోజులపాటు తోటల్లో కాయల దిగుబడి ఉంటుందని, ధరలు మాత్రం పెరిగే పరిస్థితి కనిపించడం లేదని రైతులు అంటున్నారు.


యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



దివ్యాంగులకు వాహనాలు అందజేసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పదిమంది దివ్యాంగులకు రూ.10 లక్షల విలువ చేసే స్కూటీలను ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అక్బర్‌తో కలిసి శుక్రవారం నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఉపకరణాలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మోదేపల్లి పెంచల నాయుడు, అక్కలరెడ్డి అంకిరెడ్డి, తాటిబోయిన సురేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

127 గ్రామాల్లో భూముల రీ సర్వే

• ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'
• జేసీ కూర్మనాథ్



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా రెండో విడతలో 127 గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతోందని జేసీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. నెల్లూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మొదటి విడతలో 118 గ్రామాల్లో సర్వే చేసి భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేశామన్నారు. రెండో విడతకు సంబంధించి భూమి కలిగిన వారికి నోటీసులు అందజేసి వారి సమక్షంలోనే హద్దు రాళ్లతో పూర్తి చేస్తున్నామన్నారు. భూ హక్కు పత్రాలు పొందిన రైతులకు గత పాస్‌బుక్‌లతో అవసరం ఉండదన్నారు. జిల్లాలో సుమారు 4,900 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని పేర్కొన్నారు. జాతీయ రహదారుల భూసేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నెల్లూరు – ఆత్మకూరు, బెంగళూరు – కడప – విజయవాడ జాతీయ రహదారులకు సంబంధించి ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లా కేంద్రం వరకు రాకుండా మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారుల్లో జవాబుదారీతనం మరింత పెరిగిందన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా ఎక్కువ దృష్టి సారిస్తున్నారన్నారు. సామాన్య ప్రజలకు అత్యంత సులువుగా సమస్యలు పరిష్కారమయ్యేందుకు జగనన్నకు చెబుదాం గొప్ప వేదిక అన్నారు.

15 వరకు పాఠశాలల్లో ప్రదర్శనలు

నెల్లూరు(టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల సంకల్పయాత్రలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) భాగీధారి ప్రదర్శనలను నిర్వహించాలని డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఈనెల 15వ తేదీ వరకు టీచర్లు, విద్యార్థులు కలిసి కొన్ని కృత్యాలు చేసి రాష్ట్ర స్థాయిలో ఉన్న గూగుల్ ట్రాకర్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి బడిలో టీచర్లు వారు తయారు చేసిన టీఎల్ఎంను ప్రదర్శించాలన్నారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల సంసిద్ధత మేళా, సాంకేతిక వినియోగం, ఎస్ఎంసీలు, తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాల నిర్వహణ, కథలు చెప్పడం, కృత్యాలు నిర్వహించడం, సైకిల్ ర్యాలీలు, క్విజ్, గోడ మీద చిత్రాలు, వీధి నాటకాలు, బుర్ర కథలు ప్రదర్శించాలన్నారు. ఈనెల 5న మండల స్థాయి ప్రదర్శనలు పెట్టాలన్నారు. 3 అత్యుత్తమ ప్రదర్శనలను జిల్లాస్థాయికి పంపాలన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శన ఈనెల 7వ తేదీన దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శనివారం జిల్లాకు రానున్నారు. కావలి మండలం కరేటివారిపాళెంలో గిరిజన భూ సమస్యను పరిశీలించేందుకు ఆయన విచ్చేస్తున్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు(టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 43 కేంద్రాల్లో పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించారు. 2,406 మందికి గానూ 1,763 మంది హాజరయ్యారు. 643 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 570 మెగావాట్లు, రెండో యూనిట్లో 500, మూడో యూనిట్లో 625 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

కస్తూర్బాల్లో బోధనా సిబ్బంది పోస్టుల భర్తీ

నెల్లూరు(టౌన్): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధనా సిబ్బంది పోస్టుల కోసం ఆసక్తి గల వారు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఏడాదిపాటు బోధించేందుకు పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇతర వివరాలకు 94412 70099 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గాయపడిన వారిలో ఒకరి మృతి

• ఇద్దరి పరిస్థితి విషమం


చేజర్ల: మండలంలోని మాముడూరు గ్రామ సమీపంలోని సవకతోటలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తుండగా గత శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన ఐదుగురిలో ఒకరు మృతిచెందారు. శుక్రవారం ఎస్సై మరిడి నాయుడు వివరాలు వెల్లడించారు. గాయపడిన ఐదుగురు కూలీల్లో ఇద్దరు ఆత్మకూరు ప్రైవేట్ వైద్యశాలలో, మరో ముగ్గురు నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురిలో బండి శివ (30) అనే కూలీ గురువారం రాత్రి మృతిచెందాడు. ఇదే వైద్యశాలలో చికిత్స పొందుతున్న రమేష్, సుబ్రహ్మణ్యం అలియాస్ మణిల పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు చెబుతున్నారు. శివ స్వగ్రామం కోవూరు మండలంలోని పాటూరు గ్రామం.

రైలు కింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

కొడవలూరు: కొడవలూరు – తలమంచి రైల్వేస్టేషన్‌ల మధ్య ఎగువ లైన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. వృద్ధురాలు బ్లూ కలర్ చీర ధరించి ఉంది. గుండు చేయించుని ఉన్నారు. ఆమె వద్ద నెల్లూరు–2 డిపో పల్లెవెలుగు బస్సు టిక్కెట్ లభ్యమైంది. వయసు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహం ఉన్న తీరుని బట్టి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని చెబుతున్నారు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	రూ. 50
సన్నవి	రూ. 20
పండ్లు	రూ. 15

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	160
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	300
లేయర్ చికెన్	170

స్వయం సహాయక గ్రూపులకు బ్యాంకు రుణాలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

• పొదుపు రుణాలివ్వడంలో అభ్యంతరాలు చెప్పొద్దు
• క్రమం తప్పకుండా రికవరీ సమావేశాలు
• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు రుణాలు అందజేయడంలో బ్యాంకు అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి కోరారు. నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకు అధికారులు, డీపీఎంలు, ఏసీలు, ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. పొదుపు రుణాలు తీసుకునే విషయంలో బ్యాంకు అధికారులు అభ్యంతరాలు చెప్పొద్దని తెలిపారు. మహిళలు అత్యవసర సమయాల్లో రుణాలందక సూక్ష్మ సంస్థలను ఆశ్రయిస్తున్నారన్నారు. సోమశిల, ఉలవపాడు బ్యాంకుల్లో అకౌంట్లు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందన్నారు. మండలాల్లో క్రమం తప్పకుండా ప్రతి నెలా కమ్యూనిటీ బేస్డ్ రికవరీ మేనేజ్‌మెంట్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌పీఏలో ఉన్న గ్రూపుల వివరాలు సేకరించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. 90 శాతం రికవరీలు చేసిన గ్రూపులకు మాత్రమే తిరిగి రుణాలు మంజూరు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విషయంలో పేద మహిళలను ఇబ్బందులు పెట్టొద్దని తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు మంజూరు చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను వినియోగించుకోవడంలో జాప్యం చేయొద్దన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలన్నారు. రుణాలు అందుకున్న మహిళలు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీడీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ముసుగులో చోరీలు

• ముగ్గురు మహిళల అరెస్ట్
• రూ.3.80 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల ముసుగులో చోరీలకు పాల్పడిన ఘటనలో ముగ్గురు మహిళలను నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎ.లక్ష్మి గత నెల 14వ తేదీన నెల్లూరుకు వచ్చారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె గాంధీబొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ముగ్గురు గుర్తుతెలియని మహిళలు అదే ఆటోలో ఎక్కారు. లక్ష్మికి చెందిన హ్యాండ్‌బ్యాగ్ తెరిచి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. బస్టాండ్ వద్ద ఆటో దిగిన లక్ష్మికి బ్యాగ్‌లోని నగలు కనిపించకపోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై ఎ.సైదులు తన సిబ్బందితో కలిసి కేసు దర్యాప్తును ప్రారంభించారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లు, సాంకేతికత ఆధారంగా నిందితురాళ్లు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.సంధ్య, భాను, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, గొట్లం గ్రామానికి చెందిన ఆర్.వసంతగా గుర్తించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వీఆర్ లా కళాశాల ఎదురుగా ఉన్న రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేసి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతోపాటు క్రైమ్ పార్టీ ఏఎస్సై శ్రీహరి, హెచ్‌సీలు సురేష్, నరసయ్య, నజ్మల్, పీసీ శ్యామ్, వర్ధన్, దేవను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, డీఎస్పీ డి.శ్రీనివాస రెడ్డి అభినందించారు.

ఎర్త్‌ప్లేట్లను తప్పనిసరిగా మార్చాలి

• ఎస్ఈ వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో 25 సంవత్సరాలుగా ఉన్న ఎర్త్‌ప్లేట్లను తప్పనిసరిగా మార్చాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన ఈఈ, ఏఈఈ, అసిస్టెంట్స్ అకౌంట్స్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్ర తీరానికి సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఎర్త్‌ప్లేట్లు తరచూ తుప్పు పడుతుంటాయని వాటిని యుద్ధ ప్రాతిపదికన మార్చాలన్నారు. ప్రతి డివిజన్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు అవసరమైన నిర్వహణ (మెయింటెనెన్స్) సామగ్రి ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో విద్యుత్ కోతల్లేవని, రోజువారీ వినియోగం గణనీయంగా 21 మిలియన్ యూనిట్లు (ఎంయూ)కు పెరిగినప్పటికీ, అందుకు అనుగుణంగా సరఫరా చేస్తున్నామన్నారు. వర్షాలు, ఈదురుగాలులు వీచిన వేళల్లో, నూతనంగా విద్యుత్‌లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేసే సమయాల్లో, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు మరమ్మతులు చేపట్టేందుకు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నట్లు చెప్పారు. బిల్లులు రీడింగ్ తీసే సమయంలో పాత మీటర్లను గుర్తించి వెంటనే ఐఆర్డీఏ మీటర్స్‌ను ఏర్పాటు చేసి రీడింగ్ తీయాలని సూచించారు. దీర్ఘకాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులను గుర్తించాలని, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధిత రైతు ఆధార్, ఫోన్ నంబర్లు లింక్ చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తయిన గృహాలకు త్వరితగతిన విద్యుత్ సరఫరా సదుపాయం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎనర్జీ ఆడిట్ ఈఈ బెనర్జీ, రాఘవేంద్రం తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై



ప్రమాద స్థలం

• ఇద్దరికి తీవ్ర, ఐదుగురికి స్వల్ప గాయాలు
• మృత్యువాత పడిన గొర్రెలు తెచ్చిన తంటా

కొడవలూరు: హఠాత్తుగా ఆగిన కంటైనర్‌ను ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో బస్సులోని ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గొర్రెలతో వలస వచ్చిన వారు గురువారం రాత్రి నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఖాళీ స్థలంలో వాటిని తోలి అక్కడే నిద్రించారు. శుక్రవారం వేకువజామున 4.30 గంటల సమయంలో గొర్రెలు రోడ్డుపైకి వచ్చేశాయి. ఈ క్రమంలో జీవాలను గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మృతిచెందిన గొర్రెలను కాపరి పక్కకు తొలగించే ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలో కావలి వైపు నుంచి కంటైనర్ వస్తోంది. దాని డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న గొర్రెలను మనుషులుగా భావించి హఠాత్తుగా బ్రేక్ వేసి రోడ్డుపైనే నిలిపాడు. దాని వెనుక వస్తున్న విశాఖపట్నం – బెంగళూరు ట్రావెల్స్ బిగ్ బస్సు వేగం అదుపు కాక కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులు స్వల్పంగా, మంజు శిరీష, దుర్గా ప్రసాద్ అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారికి శస్త్రచికిత్స చేశారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్సై జి.సుబ్బారావు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెవెన్యూ శాఖలో 47 మంది బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీలు కొనసాగుతున్నాయి. తాజాగా జిల్లా రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 47 మందిని శుక్రవారం సాయంత్రం బదిలీ చేస్తున్నట్లు కలెక్టరేట్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 21 మంది డిప్యూటీ తహసీల్దార్లు, తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఎనిమిది మంది అటెండర్లను బదిలీ చేశారు.

రవాణా శాఖలో..

నెల్లూరు(టౌన్): జిల్లా రవాణా శాఖలో ఇద్దరు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రవాణా కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న వంశీ గుంటూరుకు, అక్కడ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న సత్యక్రాంతి నెల్లూరుకు, అదే విధంగా సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఒంగోలుకు, అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సీహెచ్ కృష్ణయ్యను నెల్లూరుకు బదిలీ చేశారు.